## క్లుప్తంగా

### కాలుష్య రహిత టపాసులతో దీపావళి



విద్యార్థులతో దీపాలు వెలిగించిన హెచ్ఎం వెంకటరమణ

కరప: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కాలుష్యరహిత టపాసులు కాలుస్తూ దీపావళి పండుగను జరుపుకోవాలని హెచ్ఎం వాకాడ వెంకటరమణ సూచించారు. మండలం నడకుదురులోని మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి ప్రమిదలనే వాడాలని కాలుష్యంలేని బాణసంచా వినియోగించి, దీపావళి సంబరాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించారు. ఉపాధ్యాయిని కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

### దీపావళి సామగ్రి పంపిణీ



విద్యార్థులకు దీపావళి సామగ్రి పంపిణీ చేసిన లయన్స్‌క్లబ్ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దీపావళి పండుగ సందర్భంగా స్థానిక కల్పనా సెంటర్ సమీపంలోని మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో దీపావళి సామగ్రి పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ స్టార్స్ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ సీహెచ్ గణేష్, జెడ్సీ నమశ్శివాయ, కార్యదర్శి నాగేశ్వరి, ట్రెజరర్ నాగమణి పాల్గొన్నారు.

### తూరంగిలో చోరీ

రూ.లక్ష విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో చోరీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై వీరబాబు తెలిపారు. తూరంగి పంచాయతీ సమీపంలో నున్న వరదరాజు చెందిన ఇంట్లో సోమవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 5 కాసులు విలువైన బంగారు ఆభరణాలు, 750 గ్రాముల వెండి ఆభరణాలను దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, చోరీ సొత్తు విలువ రూ.లక్ష ఉంటుందని ఎస్సై వీరబాబు తెలిపారు.

### యండమూరులో రీ సర్వే-గ్రామసభ



యండమూరు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: మండలం యండమూరులో మంగళవారం రీసర్వే-గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతుల దస్తావేజుల ప్రకారం రికార్డులలో విస్తీర్ణం లేకపోయినా, సర్వే నంబర్ల సబ్‌డివిజన్ చేయించుకోవాలన్నా, ఇతర సమస్యలుంటే దరఖాస్తు చేసుకుంటే, రీసర్వే చేసి, సరిచేస్తామనిని తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోరుతూ 205 దరఖాస్తులు వచ్చినట్టు వీఆర్వో పలివెల ఏసుబాబు తెలిపారు. సర్పంచ్ మార్నెళ్ల శివ, రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్ మండల సర్వేయర్ ఎస్.రూపవతి, గ్రామ కార్యదర్శి పి.బ్రహ్మనందం, వీఎస్ ఎం.వీరేష్ పాల్గొన్నారు.

### క్యూబా ప్రజలపై ఆంక్షలు ఎత్తివేయాలి

కాకినాడ సిటీ: క్యూబా ప్రజలపై అమెరికా ఆంక్షలు విధించి 66 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ మేరకు డిమాండ్ చేస్తూ మంగళవారం ఇంద్రపాలెంలాకులు, అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి పెంచేలా వీరగాధ

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీలు
- మూడో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు నిర్వహణ
- విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించేందుకు శ్రీకారం



బాలాజీచెరువు: విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించడమే లక్ష్యంగా వీర్‌గాధ 4.0 పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 3వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ పోటీలు నిర్వహించనుంది. రక్షణ, విద్యాశాఖ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా పోటీలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు అదేశాలు జారీ చేసింది. తొలుత పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వీర్‌గాధ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గ్యాలంట్రీ పురస్కార గ్రహీతలైన సైనిక వీరుల ధైర్యం, సాహసాలు, త్యాగాలు,జీవిత గాధలను నేటి విద్యార్థులకు పరిచయం చేయడానికి పోటీలు నిర్వహించి, వెబినార్ల ద్వారా వివిధ సెషన్లలో దృశ్యరూపకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

**ఎంపిక ఇలా..**

వచ్చేనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జిల్లా స్థాయి ఎంట్రీలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. 12వ తేదీ నుంచి 30 వరకూ రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4 నుంచి 24 వరకూ జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ అర్హులే. అక్టోబర్ 31వ తేదీలోగా పాఠశాల స్థాయిలో కవితా రచన, వ్యాస రచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు జరపాల్సి ఉంటుంది. ప్రతి కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచిన ఎంట్రీ (మొత్తం 4 ఎంట్రీలు) ప్రధానోపాధ్యాయుడు మై గవర్నమెంట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు, జిల్లా స్థాయిలో మొదటి నలుగురిని, రాష్ట్రస్థాయిలో మొదటి 8 మందిని, జాతీయ స్థాయిలో మొదట వంద మందిని (సూపర్ 100) ఎంపికచేసి రానున్న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. వీరిని సూపర్ 100 విజేతలుగా పిలుస్తారు. ఇందులో 3 నుండి 5వ తరగతి వరకూ 25 మందిని, 6 నుండి 8 వ తరగతి వరకూ 25 మందిని, 9, 10 తరగతులకు చెందిన 25మంది, ఇంటర్మీడియెట్‌కు చెందిన మొత్తం 100 మందిని జాతీయ స్థాయికి ఎంపికచేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు ధృవపత్రాలు అందజేస్తారు. జాతీయ స్థాయి విజేతలకు రక్షణ మంత్రిత్వ శాఖలు రూ.10 వేలు చొప్పున నగదు అందజేస్తారు.

### విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, వారిలో సృజనాత్మకత వెలికితీసేందుకు మంచి అవకాశం. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– చింతాడ ప్రదీప్‌కుమార్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు

### ఎక్కువమంది పాల్గొనేలా..



పోటీల్లో ఎక్కుమంది పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాము. ప్రధానోపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తున్నాం. ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలను వీర్‌గాధ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపికచేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

### కబడ్డీ పోటీల పరిశీలకునిగా శ్యామ్‌కుమార్



డాక్టర్ శ్యామ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చెన్నైల ఎస్ఆర్ఎం వర్సిటీలో నిర్వహించే కబడ్డీ మెన్ పోటీలకు జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి పి.శ్యామ్‌కుమార్ నియమితులయారు. ఈ సందర్భంగా మంగళవారం తన చాంబర్‌లో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అభినందించి సౌత్‌జోన్ కబడ్డీ గేమ్స్ విజయవంతంగా నిర్వహించి వర్సిటీకి పేరు తీసుకురావాలని సూచించారు. శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ బుధవారం నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ పోటీలు నిర్వహిస్తారని, తనకు సహకరించిన వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బ్రెయిన్ స్ట్రోక్ నివారణపై అవగాహన సదస్సు



బ్రెయిన్‌స్ట్రోక్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆస్పత్రి వైద్యులు, విశ్రాంత ఉద్యోగులు



న్యూరో ఫిజీషియన్ కామరాజును సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ క్రైం: బ్రెయిన్ స్ట్రోక్ నిర్ధారణ, అత్యాధునిక చికిత్స విధానాలపై మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు మంగళవారం కాకినాడ గాంధీనగర్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ కృష్ణ హాస్కర్ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ అనేది తెలియకుండానే ఒక వ్యక్తిని కృంగదీసే ప్రమాదకరమైనదన్నారు. 'బ్రెయిన్ స్ట్రోక్' అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని ఒక్కసారిగా వికలాంగుడిగా మారుస్తుందని, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారితీస్తుందన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తరువాత రక్త నాళాలను తిరిగి తెరవడానికి రెండు చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముందుగా వినియోగించే థ్రోంబోలిసిస్ ఇంజెక్షన్ పక్షవాతం ప్రారంభమైన 4–5 గంటల వరకు ఉపయోగపడుతుందన్నారు. రెండవది థ్రోంబెక్టమీ ఇంజక్షన్ పక్షవాతం వచ్చిన 24 గంటల వరకు చేయగలిగేదన్నారు. ఇది స్టెంట్ ద్వారా రక్తనాళంలో రక్తప్రసరణకు అడ్డుగా ఉన్న దానిని తొలగించే పద్ధతని, పక్షవాతం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లగలిగితే యథావిధిగా జీవించగలుగుతారని పేర్కొన్నారు. మెడి కవర్ హాస్పిటల్ కాకినాడ సెంటర్ హెడ్ శుభాకరరావు, వైద్యుల చేతుల మీదుగా బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు తెలుసుకునే అవకాశం ఉన్న పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

**ఐడీఏ ఆధ్వర్యంలో..**

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా న్యూరో ఫిజీషియన్ అడబాల గోపీకృష్ణ బ్రెయిన్ స్ట్రోక్ వల్ల ఎదురయ్యే సమస్యలు చికిత్స విధానాలు వివరించారు. అనంతరం ఐడీఏ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపీకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, స్వరూప్, భవానీ పాల్గొన్నారు.

**పక్షవాతానికి వైద్య చికిత్స అవసరం**

కాకినాడ రూరల్: మెదడులో ఉన్న కణాలకు, రక్తనాళాలకు నష్టం జరిగి రక్తం సరఫరా కాకపోతే శరీరంలో కుడి లేదా ఎడమ వైపు గాని అవయవాలు చచ్చుబడిపోవడాన్ని పక్షవాతమంటారని, పక్షవాతానికి వెంటనే వైద్య చికిత్స అవసరమని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ బెజవాడ కామరాజు పేర్కొన్నారు. ప్రపంచ పక్షవాత నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పక్షవాతం, దాని నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో వాకర్స్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్‌నాయుడు, చింతపల్లి సుబ్బారావు, కృష్ణ, రాజా తదితరులు డాక్టరు కామరాజును సత్కరించారు.

# ఆర్థిక అండ.. భవితకు భరోసా

- వీధి వ్యాపారులకు 'స్వనిధి' చేయూత
- పటిష్ట అమలుతో వేల మందికి తోడ్పాటు
- నగరపాలక సంస్థకు దక్కిన పురస్కారం




పురపాలక శాఖ మంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకుంటున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్

కాకినాడ: కోవిడ్ సమయంలో ఉపాధి, వ్యాపారాలు లేక విలవిలలాడిన చిరు వ్యాపారుల కోసం పీఎం స్వనిధి పథకం అమలులో కాకినాడ ప్రత్యేక గుర్తింపును సాధించింది. దాదాపు 17,369 మంది చిరు వ్యాపారుల జీవనోపాధి మెరుగుపడేలా ఆర్థిక చేయూతనిచ్చినందుకు నగరపాలక సంస్థకు ప్రత్యేక అవార్డు దక్కింది. ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్ ఆత్మ నిర్భర నిధి (పీఎం స్వనిధి) పేరిట ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2021 సమయంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి ఎంతోమంది పేదలకు భరోసా ఇచ్చింది. మొదటి విడత రూ.10 వేలు, రెండో విడత రూ.20 వేలు సమకూర్చి సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడత రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ మేరకు 2023–24 సంవత్సరానికి నగరపాలక సంస్థ ఉత్తమ పురస్కారానికి ఎంపికై ంది. ప్రభుత్వ లక్ష్యాన్ని 99 శాతం అధిగమించినందుకు ఈ అవార్డు లభించింది. సుమారు 3 నెలల క్రితం కూడా ఈ పథకం అమలులో జాతీయస్థాయిలో కూడా కాకినాడ నగరపాలకసంస్థ రెండో స్థానాన్ని దక్కించుకుంది. మంగళవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్, టీపీఆర్వో శైలజ, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు తదితరులు మంత్రి నారాయణ, మెప్మా ఎండీ సీహెచ్ భరత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

### కష్టాలలో చేయూతనిచ్చి ఆదుకున్నారు



ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో స్వనిధి పథకం ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వం కల్పించిన ఈ పథకం వల్ల వ్యాపారాన్ని కొనసాగించుకుని కుటుంబాన్ని పోషించుకోగలిగాను.

– చల్లపల్లి ఈశ్వరరావు, పాన్‌షాపు యజమాని, గాంధీనగర్, కాకినాడ

# వచ్చే నెలలో నైపుణ్య గణన

కాకినాడ సిటీ: నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) నవంబర్ మొదటి వారం నుంచి నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం నైపుణ్య గణనపై కలెక్టరేట్‌లో సీపీఓ పి.త్రినాథ్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, జోనల్ ఇన్‌చార్జి స్కిల్ సెన్సస్ అధికారి రఘు, మాస్టర్ ట్రైనర్ సాయిలతో కలిసి సమీక్షించారు. మంగళవారం కలెక్టరేట్ విధాన గౌతమి హాలులో గణనపై ఈ మేరకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి స్థాయి శిక్షణ అనంతరం మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. సంబంధిత వివరాలు నైపుణ్యం అనే అప్లికేషన్ యాప్ ద్వారా సేకరిస్తారన్నారు. జిల్లాలో ఉన్న 15 నుంచి 59 వయసు మధ్య ఉన్న నైపుణ్యం గల వ్యక్తుల వివరాలు సేకరించి తద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

### సినిమాలు




| | | |
|---|---|---|
| ఆనంద్ సినిమాస్ | : | వెనమ్, విశ్వం, వేట్టయాన్ లగ్గం |
| దేవి మల్టీప్లెక్స్ | : | వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం |
| లక్ష్మీ | : | పొట్టేల్ |
| సత్యగౌరి | : | వెనమ్ |
| తిరుమల | : | వేట్టయాన్ ది హంటర్ |
| సీఅండ్‌సీ | : | నరుడి బ్రతుకు నటన |
| సీఅండ్‌సీ 2 | : | స్వాగ్ |
| పద్మప్రియ | : | దేవర |
| శ్రీప్రియ | : | మార్టిన్ |
| సూర్య 1 | : | వెనమ్ |
| సూర్య 2 | : | దేవర |

# అర్చకుల వారసత్వాన్ని కాపాడతాం

దేవదాయ, ధర్మదాయశాఖ ఉప కమిషనర్ రమేష్‌బాబు



దేవదాయశాఖ డీసీకి వినతి పత్రం ఇస్తున్న అర్చక సంఘం ప్రతినిధులు

బోట్‌క్లబ్: దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వివిధ ఆలయాల్లో సేవలందిస్తున్న అర్చకులకు వారి సర్వీసును క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని అ శాఖ ఉప కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు పేర్కొన్నారు. కాకినాడలోని డీసీ కార్యాలయంలో మంగళవారం వివిధ అగమాలకు సంబంధించిన అర్చక సంఘ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. వంశపారంపర్య అర్చకుల నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. డీసీ రమేష్ బాబు మాట్లాడుతూ అగమాల్లో నిష్ణాతులైన అర్చకులు కొత్తగా వృత్తిలోకి వచ్చే యువ అర్చకులకు ఆయా ఆగమాలు నేర్పేలా బాధ్యత తీసుకోవాలన్నారు. సింగిల్ ట్రస్టీ ఉన్న ఆలయాల్లో ఆయా దేవాలయాలకు సంబంధించి భూముల లీజుల విషయంలో దేవదాయ శాఖ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం గల ఆలయాలు సింగిల్ ట్రస్టీలుగా తీసుకునే అర్చకులు పరిపాలనా పరమైన శిక్షణ తీసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. డీసీని కలసిన వారిలో శైవసంఘ రాష్ట్ర అధ్యక్షుడు మురమండ రాంబాబు, వైఖానస సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఖండవల్లి కిరణ్ కుమారాచార్యులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు సుదర్శనం వెంకట జనార్ధనాచార్యులు, ప్రధాన కార్యదర్శి పెద్దింటి కృష్ణమాచార్యులు, కాకినాడ డివిజన్ అధ్యక్షుడు దివి శ్రీనివాసు పాల్గొన్నారు.

# ఘనంగా ధన్వంతరి జయంతి



రమణయ్యపేటలో ధన్వంతరి భగవాన్‌ను పూజిస్తున్న ఆయుర్వేద వైద్యుడు రాంజీ తదితరులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రంగరాయ వైద్య కళాశాల వైద్య బృందం, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా, డాక్టర్ సత్యదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం పురోహితులతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సత్యదేవ్ మాట్లాడుతూ క్షీరసాగర మధనంలో ధన్వంతరి ఆవిర్భవించాడనీ, ధన్వంతరినీ పురాణాల్లో అమృత పురుషుడు అంటారన్నారు. ప్రజల ఆయురారోగ్యాలను వృద్ధి చేసేందుకు వైద్య శాస్త్రాన్ని అందించిన మహోన్నతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విష్ణువర్ధన్, చిట్ల కిరణ్, యు.రామకృష్ణ, లక్ష్మీనారాయణ, మూర్తి, నర్సింగ్, ఫణి, ప్రమోదిని, శైలజ, భాగ్యలక్ష్మి, వెంకట్, సుప్రియ, రజని వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: ఆయుర్వేదానికి, ఆరోగ్యానికి మూల పురుషుడు శ్రీమన్నారాయణ స్వరూపుడైన ధన్వంతరి భగవాన్ జయంతిని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటాన్ని ఆయుర్వేద వైద్యుడు రాంజీ, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ తదితరులు పూజించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు రాంజీ మాట్లాడుతూ ఆయుర్వేదం మనకున్న వ్యాధులను నయం చేయడమే కాకుండా శరీర ఆరోగ్యం మొత్తాన్ని రక్షిస్తుందన్నారు. జీవాంశంతో కూడిన ఔషధాలే ఆయుర్వేద వైద్యానికి ప్రధానమన్నారు.

# మహిళా డ్యాన్సర్ అనుమానాస్పద మృతి



మృతిచెందిన వెంకటలక్ష్మి



బంటుపల్లి వెంకటలక్ష్మి (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): హైదరాబాద్‌కు చెందిన ఓ ఈవెంట్‌లో మహిళా డ్యాన్సర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన బంటుపల్లి వెంకటలక్ష్మి (36) ఈవెంట్ డ్యాన్సర్‌గా పనిచేస్తుంటుంది. ఈమెకు భర్త శివ, ఇంటర్మీడియెట్ చదివే ఓ కుమారుడు ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో కొంతకాలంగా ఆమె అతనికి దూరంగా ఉంటోంది. తన కుమారుడిని కూడా కాకినాడలోని తన చెల్లెలు వద్దే ఉంచి చదివిస్తూ ఆమె హైదరాబాద్‌లో ఇల్లు తీసుకుని ఉంటూ అక్కడ ఈవెంట్లకు వెళ్తూ ఉంది.

**రాత్రంతా ముగ్గురూ మద్యం తాగి...**

వెంకటలక్ష్మికి విజయవాడ నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన కసిం జ్యోతి అనే మహిళ నాలుగేళ్ల క్రితం ఈవెంట్లలో పరిచయమైంది. దీంతో అప్పుడప్పుడు ఆమె జ్యోతి ఇంటికి వచ్చి వెళ్తూ ఉంటుంది. ఇదే విధంగా ఈ నెల 28వ తేదీన నగరంలో ఓ ఈవెంట్‌కు వచ్చిన వెంకటలక్ష్మి ఆ కార్యక్రమం అనంతరం జ్యోతి ఇంటికి వచ్చింది. వారితో పాటు నల్గొండకు చెందిన ఓ వ్యక్తి కూడా ఈవెంట్లకు వస్తుంటాడు. అతను కూడా వెంకటలక్ష్మి వెళ్లిన ఈవెంట్‌కే వచ్చాడు. ఆ తరువాత అతను ఓ హోటల్‌లో దిగుతానని చెప్పగా జ్యోతి, వెంకటలక్ష్మి ఎందుకు ఇక్కడికి వచ్చేయ్ అని అతన్ని కూడా ఇంటికి పిలిపించినట్లు తెలిసింది. వీరు ముగ్గురూ కలిసి రాత్రంతా పూటుగా మద్యం తాగారు.

**ఉదయం ఏమై ఉంటుంది?**

రాత్రంతా మద్యం తాగి ఆ ముగ్గురు తెల్లారే వరకూ అక్కడే ఉండిపోయారు. తెల్లవారుజామున 6:30 గంటల సమయంలో వెంకటలక్ష్మి, నల్గొండకు చెందిన వ్యక్తి ఇద్దరూ కలిసి కిందకు వచ్చారు. ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోగా వెంకటలక్ష్మి తిరిగి జ్యోతి ఇంటికి వెళ్లినట్లు పోలీసులు సేకరించిన సీసీ కెమెరా ఫుటేజీలలో కనిపించింది. ఆమెతో పాటు ఇంట్లో ఉన్న జ్యోతి ఉదయం 9 గంటలకు నిద్ర లేచి చూడగా వెంకటలక్ష్మి ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో జ్యోతి పెద్దగా కేకలు వేసి వెంటనే తన కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు జ్యోతి ఇంటికి చేరుకుని వెంకటలక్ష్మిని కిందకు దించి ఓ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించగా ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**గతంలో కూడా పలుమార్లు ఆత్మహత్యాయత్నం**

వెంకటలక్ష్మి గతంలో కూడా మద్యం మత్తులో పలుమార్లు ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లుగా ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు వెంకటలక్ష్మి మద్యం మత్తులో తన మణికట్టును కోసుకుని ఉండొచ్చని.. ఆ తరువాత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతిరాయ్, సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పలు ఆధారాలను సేకరించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వేళంగిలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కరప: బాణసంచా తయారీలో కానీ, విక్రయాల్లో కానీ నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ హెచ్చరించారు. మండల పరిధిలోని వేళంగి, నడకుదురు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన కరప అదనపు ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి, ఆర్ఐ పవన్‌లతో కలసి పర్యటించి బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. లైసెన్స్‌లో ఉన్న డోర్ నంబరులోనే తయారు చేయాలని, నిర్దేశించిన పరిమితిలోనే బాణసంచా నిల్వలు ఉండాలన్నారు. కేంద్రం వద్ద ఇసుక, నీరు, మంటలు ఆర్పే యంత్ర పరికరం ఉంచాలన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న బాలురు, మహిళలతో పనిచేయించకూడదన్నారు. పేలుడు సామగ్రి తయారు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేశారు.

# ఏపీఎస్పీలో మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అసిస్టెంట్ కమాండెంట్ తదితరులు

కాకినాడ రూరల్: అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో మంగళవారం సిబ్బందికి మెగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని అసిస్టెంట్ కమాండెంట్ మురళీకుమార్ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు భీమశంకర్, సుదర్శన్‌రెడ్డి, పృథ్వీరాజ్, లక్ష్మీ ప్రవీణ, యూనిట్ మెడికల్ ఆఫీసరు సునీల్, లక్ష్మీదేవి, తదితరులు వైద్య సేవలందించారు. అసిస్టెంట్ కమాండెంట్ మన్మధరావు, సిబ్బంది పాల్గొన్నారు.